తుది దశకు చేరిన డాటా ఎంట్రీ

- నగర కార్పొరేషన్ పరిధిలో సమగ్ర సర్వే వివరాలు 91శాతం ఆన్‌లైన్‌లో నమోదు

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తుది దశకు చేరుకుంది. నగరంలో ఇప్పటికే 99 వేల గృహాలను గుర్తించారు. నవంబర్ 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభించారు. నవంబర్ 10 నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించారు. ఆ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదు. ఇప్పటికీ కొన్ని చోట్ల సర్వే కొనసాగుతోంది. అయితే ఎన్యుమరేటర్లు సేకరించిన డాటాను కంప్యూటర్‌లలో నిక్షిప్తం చేసే పనిని మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డాటాను కంప్యూటరీకరించే ప్రక్రియ కొనసాగుతోంది.

99 వేల ఎంట్రీలు..

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముందుగా 93 గృహాలను గుర్తించారు. తర్వాత వచ్చిన దరఖాస్తులను తీసుకోగా అవి 99 వేలకు చేరాయి. కార్పొరేషన్‌ను 725 బ్లాక్‌లుగా విభజించి 725 మంది ఎన్యుమరేటర్లు డాటాను సేకరించారు. 73 మంది సూపర్‌వైజర్లను పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డాటా ఎంట్రీ కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 40 సిస్టమ్‌లు, అర్సపల్లిలోని ఏబీసీ సెంటర్‌లో 200 సిస్టమ్‌లు ఏర్పాటుచేశారు. రెండు షిఫ్టుల్లో డాటా ఎంట్రీ చేస్తున్నారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు డాటా ఎంట్రీ నమోదు చేశారు. ఇప్పటివరకు 92 వేల ఎంట్రీలు పూర్తిచేసినట్లు మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ తెలిపారు.



నగరంలో డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

త్వరలో పూర్తిచేస్తాం..

నగర మున్సిపల్ పరిధిలో ఎన్యుమరేటర్లు ఇప్పటి వరకు 97వేల గృహాల సర్వే పూర్తిచేశారు. దానికి సంబంధించిన వివరాలను మాకు సమర్పించారు. ఇప్పటివరకు కంప్యూటర్ ఆపరేటర్లు 92 వేల ఎంట్రీలు పూర్తిచేశారు. మరో రెండుమూడు రోజుల్లో ప్రక్రియ మొత్తం పూర్తికానుంది.

శంకర్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్, (డాటా ఎంట్రీ ఇన్‌చార్జి) నిజామాబాద్

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



ధర్మారం(బి) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి/ఇందల్వాయి: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల గుర్తింపు కోసం చేపట్టిన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో శనివారం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించి వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఇందల్వాయి మండలంలోని గంగారాం తండాలో ఆయన నమూనా సర్వేను నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో యాప్‌పై తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్ మండలంలో..



నర్సింగ్‌పల్లిలో..

మోపాల్: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. నర్సింగ్‌పల్లి గ్రామంలో ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో యాప్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో దరఖాస్తుదారులను పరిశీలించి వివరాలు యాప్‌లో నమోదు చేశారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులపై ‘ప్రజావేదిక’



సిరికొండ: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో సాయాగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకపోవడం అభినందనీయమన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, పనుల కాలంలో ఎంపీడీవోగా ఉన్న లక్ష్మీప్రసాద్, ఏపీవో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల జాబితా ప్రదర్శన



డిచ్‌పల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శనివారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితాను ప్రదర్శించారు. అన్ని గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లు గుర్తించి వాటి ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన




సిరికొండ: మండలానికి ఐటీఐ కళాశాల మంజూరు కావడంతో కళాశాల భవన నిర్మాణం కోసం స్థలాలను ఆర్డీవో రాజేంద్రకుమార్ శనివారం పరిశీలించారు. చిన్నవాల్గోట్‌లో, సర్పల్లి తండా పరిధిలో గల స్థలాలను, వాటి రికార్డులను ఆర్డీవో పరిశీలించారు. చిన్నవాల్గోట్‌లో గల స్థలాన్ని ఎంపిక చేయాలని గ్రామస్తులు ఆర్డీవోకు విన్నవించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఎమ్మార్ఐ గంగరాజం,సర్వేయర్ స్వామి, కాంగ్రెస్ నాయకులు మహిపాల్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగడాలను అరికట్టాలి



నిజామాబాద్‌రూరల్: కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగడాలను అరికట్టాలని జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంఠేశ్వర్ బైపాస్‌లోని వెల్మ సంఘం భవనంలో శనివారం వెల్మ సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ.. శాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వెల్మ సంఘంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలకు రాబోయే రోజుల్లో కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. అనంతరం రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ఆరీఫ్‌కు శాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. సంఘ సభ్యులు రామకిషన్‌రావు , దయాకర్‌రావు, అవంతిరావు, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



ఖలీల్‌వాడి: జిల్లాకేంద్రంలోని జిల్లా కోర్టు హాల్‌లో శనివారం నూతన చట్టాలపై పోలీసులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రహీమొద్దీన్, రాజేశ్వర్‌గౌడ్ అవగాహన కల్పించారు. చట్టాలు, శిక్షలు, నిందితుడిని అరెస్ట్ చేసే విధానం గురించి క్లుప్తంగా వివరించారు. ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్, రాజు, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ దిలీప్, బంటు వసంత్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

ధర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా విజయోత్సవాలు చేసుకుంటే బీజేపీ నాయకులు ఓర్వలేక పోరు సభను నిర్వహిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, నాయకులు భాస్కర్ రెడ్డి, చెలిమె నర్సయ్య, నవీన్ గౌడ్ , మహేందర్, రవి ,గంగారెడ్డి పాల్గొన్నారు.



ధర్పల్లిలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

మోపాల్: బోర్గం(పి)లో ఇటీవల జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన కామర్స్ గంగారాం సహా మిగతా నాలుగు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బోర్గంలో గంగారాం కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించి, రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భూమారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకులు చిలుక సాయిలు, రాజశేఖర్ రెడ్డి, చిట్టీ సాయరెడ్డి, శేఖర్ రెడ్డి, సుభాష్, పసుల శ్రీనివాస్, అశోక్, అనిల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మధు, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో శనివారం అయ్యప్ప స్వాములు సామూహిక అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు కులకర్ణి శ్రీనివాస్, గురు లింగం శివయ్య , బుక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా అగ్గి మల్లన్న స్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో అగ్గి మల్లన్న స్వామి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో సీడీని ఊరేగించారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. బోనాలను ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



మోపాల్: బోర్గం(పి) ఐదవ డివిజన్‌లోగల శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డిచ్‌పల్లి: అధ్యాపకులు వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేవిధంగా కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన శక్తిని తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ.. వెనకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. కళాశాలలో గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు నిర్వహణ కోసం నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్ చంద్రవిఠల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

బాపూజీ వచనాలయ ఎన్నికలు జరిగేనా..?

- అనర్హతపై హైకోర్టుకెక్కిన అభ్యర్థి
- ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని మహాత్మాగాంధీ వచనాలయ ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ముందుగానే నోటిఫికేషన్ జారీచేశారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించారు. ఈక్రమంలో నేడు (ఆదివారం) అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యుల పోస్టుల కోసం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. కానీ ఓ అభ్యర్థి ఎన్నికలపై హైకోర్టును ఆశ్రయించడంతో సందిగ్ధం నెలకొంది. బాపూజీ వచనాలయంలో మొత్తం 488 మంది సభ్యులున్నారు. ఈ సభ్యుల్లోంచి ఎన్నికలకు పోటీచేస్తున్నారు.

కానీ ఈసారి ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీచేస్తున్న కోనేరు సాయికుమార్ తనను ఎన్నికల్లో పోటీచేయనీయకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని వాపోయాడు. అధ్యక్షుడికి కనీసం ఐదేళ్ల అనుభవం, ఇతర పోస్టులకు రెండేళ్ల క్రితం సభ్యత్వం ఉండాలన్న నిబంధనను కొత్తగా సృష్టిస్తున్నారని తెలిపారు. తనకు ఐదేళ్ల కాలపరి మితి లేనందుకు తన అభ్యర్థిత్వాన్ని తొలగించినందుకు కోర్టును ఆశ్రయించాడు. అయితే కోర్టు 4 వా రాల్లో వివరాలు అందించాలని అధ్యక్షుడు, కార్యదర్శిని ఆదేశించింది. కానీ ఎన్నికలకు సిబ్బంది ఏ ర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల అధికారులుగా శ్రీహ రి ఆచార్య, పులిజైపాల్, ఆరెట్టి నారాయణలను నియమించారు. అయితే వివాదాలు నెలకొనడంతో నేడు ఎన్నికలు జరుగుతాయా? లేదా అన్న మీమాంస నగరవాసుల్లో నెలకొంది.

వాహనాల తనిఖీ

మోపాల్: మండల కేంద్రంలో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన అన్నారు. సిబ్బంది దయాల్ సింగ్, రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ పనుల పరిశీలన

వర్ని: మండలంలోని సిద్దాపూర్ శివారులో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను శనివారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

ధర్పల్లి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు చెప్పి ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై రూరల్ నియోజకవర్గస్థాయి బహిరంగ సభను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు ఒకటేనని పాలకులు మారిన పాలన విధానం మారలేదని విమర్శించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని స్థానిక ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ప్రధాని మోదీ దయతోనే జిల్లాకు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు వచ్చాయన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిలను ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో అభివృద్ధి పరచామన్నారు. అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు గద్దె భూమన్న, తిరుపతి రెడ్డి, రాజేశ్వర్, సతీష్ ,కర్కా గంగారెడ్డి, మహిపాల్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

నిజామాబాద్ సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తున్నారని పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కాంగ్రెస్ సీనియర్‌నేత సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. జిల్లాకేంద్రంలోని నాగారం, ఇంద్రాపూర్, అహ్మద్‌పుర కాలనీల్లో శనివారం కాంగ్రెస్ విజయోత్సవాల సభలను నిర్వహించారు. కార్యక్రమంలో వేణుగోపాలాచారి పాల్గొని, మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలుచేశామని, మిగతా హామీలు చేసేందుకు తమకు నాలుగేళ్ల కాలం ఉందన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని ప్రజలను కోరారు. బీజేపీ నాయకులు కేవలం మాటలకే పరిమితమయ్యారన్నారు. పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేస్తారని హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు రత్నాకర్, జావేద్ అక్రం, ఖుద్దూస్, ఫహీం ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

డిచ్‌పల్లి: జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికులందరికీ కొన్ని నెలలుగా బకాయిలు పడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ డిమాండ్ చేశారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆసిఫ్‌ఖాన్, పంచాయతీ కార్మికులు సాయిలు, శేఖర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,800	వెండి(కిలో)	95,200
22 క్యారెట్స్	72,705	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	50	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	40
జీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	35	60	ఆలుగడ్డ	35	50
జిర్నికాయ	35	60	గోబిగడ్డ	25	50
కాకరకాయ	30	60	గోబిపువ్వు	50	90
వంకాయ	10	20	బీట్‌రూట్	50	90
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	35	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	25	50
క్యాప్సికం	60	90			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)	
స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15, 2.00,6.00,10.00
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-1.00,4.45,9.10
స్క్రీన్-3	పుష్ప-2-11.00,3.10,7.00,10.45
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)	
స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25,10.30
స్క్రీన్-2	పుష్ప-2(తెలుగు)-9.30,1.35, .5.40, 9.45
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15
స్క్రీన్ -4	పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20
లలితామహల్	కేసీఆర్(తెలుగు)
దేవి	పుష్ప-2(తెలుగు)
నటరాజ్	పుష్ప-2 (హిందీ)
విజయ్	పుష్ప-2 (తెలుగు)

సంక్షిప్తం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దులం ఉన్నత పాఠశాల విద్యార్థిని రిషికారెడ్డి జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగారాం శనివారం తెలిపారు. త్వరలో పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రిషికారెడ్డిని హెచ్‌ఎం, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జక్రాన్‌పల్లి మండలంలో..



జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని సాన్విక అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పురుషోత్తమాచారి తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వీడీసీ సభ్యులు, టీచర్లు అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వంచ మహేష్‌రెడ్డి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, ఎర్రన్న, నరేష్, దేగాం సాయన్న, మల్లేష్‌యాదవ్, సంతోష్, ఆసిఫ్, దిగంబర్, శోభన్, సంతోష్‌నాయక్, ముషీర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేత



సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన ఓ బాధితురాలికి నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు రూ.62వేల నగదును శనివారం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, రవి, దోని మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు చింతలూర్ విద్యార్థులు

జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరయ్యారు. ఉపాధ్యాయులు రాజేందర్, గంగారాం, బల్‌రాం, ఉమాదేవి, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడాలి



నిజామాబాద్ రూరల్: ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని నిజామాబాద్ జిల్లా నార్త్ మండల ఎంఈవో సాయిరెడ్డి తెలిపారు. వినాయక్‌నగర్‌లోని శ్రీచైతన్య బ్రాంచ్-2లో శనివారం నిర్వహించిన నాసా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సైన్స్ ప్రయోగాల్లో ప్రతిభ కనబరచాలని కోరారు. సోషల్ వీక్‌లో భాగంగా పోస్టర్ మేకింగ్ ప్రయోగాలను దగ్గరుండి తిలకించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థులకు నాసా యూనిఫామ్, పుస్తకాలను అందజేశారు. ఏజీఎం సతీష్ రెడ్డి, ఏసీవో, బ్రాంచ్-2 హెచ్‌ఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ధర్నాచౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే దీక్షలు శనివారం కొనసాగాయి. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పీఆర్టీయూ సంఘం అధ్యక్షుడు కృపాల్ సింగ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ వారికి మద్దతు తెలిపారు.